ప్రజాశక్తి
ఆదివారం 20 అక్టోబర్ 2024 5 అనంతపురం





బస్సుయాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులు

అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేద్దాం

- జెడ్పీ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్
- సమస్యలపై ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపిపిల నిలదీత
- సత్యసాయి కలెక్టర్ గైర్హాజరుపై పలువురి అభ్యంతరం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో పని చేస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి, సంక్షేమ సాధించే దిశగా ముందుకు సాగాలని రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ఎంఎస్.రాజు, పల్లె సింధూర రెడ్డి, అనంతపురం కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా డిఆర్ఒ కొండయ్య, జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జి సీఈవో వెంకటసుబ్బయ్యతో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు
మంత్రి సత్యకుమార్ యాదవ్

ఎంతో నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరూ ఆయా ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ఎంపిపిలు, జెడ్పీటీసీలు పని చేయాల్సి ఉందన్నారు. రాజకీయ విభేదాలు పక్కనపెట్టి అభివద్ధి కోసం ముందుకు నడవాల్సిన అవసరం ఉందన్నారు. రైతాంగానికి సంబంధించి సాగునీటి వ్యవస్థ, హెచ్ఎల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా సాగునీరు అందించాల్సిన అవసరంపై ఎమ్మెల్యేలు చెబుతున్నారన్నారు. కరువు జిల్లా అనంతకు సాగునీటిని అందించేలా అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించి 49 చెరువులు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నింపాలని ఇటీవల నిర్వహించిన ఐఎబి సమావేశం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. చెరువులకు నీరు ఎప్పుడు విడుదల చేస్తారు.. ఎంత వేగంతో వస్తున్నాయి.. లీకేజీలు ఎక్కడున్నాయి తదితర అంశాలను యజ్ఞంగా తీసుకుని అధికారులు ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. కాలువల వెంట ఏఈలు, డిఈలను పంపకుండా నీరు వచ్చేస్తున్నాయి అనడం సరైన పద్ధతి కాదని అధికారులకు చెప్పారు. క్షేత్రస్థాయిలో ఏదైనా ఇబ్బందులు ఉంటే తెలపాలన్నారు. మండల స్థాయిలో నిధులు కావాలన్నా, లీకేజీలు ఉన్నాయన్నా పైఅధికారులు దృష్టికి తీసుకువెళ్లాన్నారు. ప్రజల ఓట్లతో ప్రజాసేవ చేసేందుకు ప్రజాప్రతినిధులుగా వచ్చామన్న విషయాన్ని సభ్యులు అందరూ గుర్తుంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణ రహదారులను వేసేందుకు నివేదికలు పంపాలని కలెక్టర్, జెడ్పీ ఛైర్‌పర్సన్‌ను కోరారు. వీటికి త్వరితగతిన ప్రతిపాదనలు పంపితే కేంద్రం ప్రయారిటీ ప్రకారం నిధులు విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలన్నారు. అవసరం ఉన్నచోట్ల పిహెచ్‌సిల ఏర్పాటుకు కషి చేస్తామన్నారు. రాబోయే సమావేశానికి రెండు జిల్లాలకు సంబంధించి కలెక్టర్ స్థాయి నుంచి కింద స్థాయి అధికారులు అందరూ హాజరుకావాలని స్పష్టమైన ఆదేశాలు ఇస్తామన్నారు.



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ఏ ప్రాతిపదికన పింఛన్లు తొలగిస్తున్నారు..?
జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ



ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు నెలల్లోనే 5,098 వద్ధాప్య పింఛన్లు, 519 వికలాంగుల పింఛన్లను తొలగించారని దేని ప్రామాణికంగా వీటిని తొలగించారనే విషయాన్ని అధికారులు తెలపాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ ప్రశ్నించారు. ఇంతకు ముందు అర్హత ఉండి ఆన్లైన్లో మంజూరై వచ్చిన పింఛన్లను ఎందుకు తొలగిస్తున్నారన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఖచ్చితంగా ప్రొటోకాల్ పాటించేలా అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. సాధారణ సర్వసభ్య సమావేశానికి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ హాజరయ్యేలా చూడాలన్నారు.

చెరువులను కృష్ణా జలాలతో నింపండి
ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని చెరువులనూ కృష్ణా జలాలతో నింపాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. కొత్తచెరువు, బుక్కపట్నం మండలంలోని అన్ని చెరువులకు నీరు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. హంద్రీనీవా కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. చెరువులను ఎప్పుడు నీటితో నింపుతారనే విషయాలను తేదీలతో తెలపాలన్నారు.

అర్హులందరికీ పింఛన్లు
ఎమ్మెల్యే ఎంఎస్.రాజు



గతంలో అనర్హులకు పింఛన్లు ఇస్తున్నారని, అలాంటి వాటిని తొలగించే క్రమంలో పారదర్శకత పాటించి తొలగింపుదారులకు అర్థం అయ్యే విధంగా తెలియజేసి వాటిని తొలగించి అర్హులకు ఇవ్వాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. సదరం సర్టిఫికెట్లను మూగ, చెవిటి, అర్హత కలిగిన వారికి ఇవ్వాలన్నారు. సమావేశానికి శ్రీ సత్యసాయి జిల్లా అధికారులు ఒక్కరూ రాకుండా ఉన్నారని, ఉన్నవారిలో కూడా ఇన్‌ఛార్జి వ్యవస్థ ఉందన్నారు. జెడ్పీ సమావేశానికి రాకుండా ఉండడం సరికాదన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు
కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్



జెడ్పీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆయా శాఖల సాధారణ యాక్టివిటీలు, పల్లె పండుగ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం పిలవాలన్నారు. ఉపాధి హామీ కింద గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ అప్రూవల్‌తోనే పనులు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కువ చెక్‌డ్యామ్‌లు, ఫారంపాండ్లు, ఇతర పనులు చేపడతామని, భైరవాణితిప్ప ప్రాజెక్ట్‌లో ప్రాధాన్యతగా నీటి నిల్వకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతపురం నగరంలో ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులకు తెలిపామని, ప్రాధాన్యత పరంగా ప్రాజెక్టులు జిల్లాకు వస్తాయన్నారు. ఈ సమావేశంలో రెండు జిల్లాల వ్యవసాయ అధికారులు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, డీఆర్డీఏ పీడీలు ఈశ్వరయ్య, నరసయ్య, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎల్‌సి ఆధునీకరణకు

నిధులు కేటాయించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్
- ముగిసిన 'సాగునీటి కోసం సిపిఎం బస్సుయాత్ర'
- రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, ఆత్మకూరు, రాప్తాడు

హెచ్ఎల్‌సి ఆధునీకరణకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. హంద్రీనీవా వెడల్పు పనులు చేపట్టాలని కోరారు. సాగునీటికై సిపిఎం చేపట్టిన బస్సు యాత్ర శనివారం సాయంత్రంతో ముగిసింది. ఈనెల 15వ తేదీన ఈ యాత్ర బొమ్మనహాల్ మండలం ఉంతకల్లులో ప్రారంభమై జిల్లా అంతటా సాగింది. శనివారం సాయంత్రం ఆకుటోటపల్లితో ముగిసింది. సోమవారం నాడు సాగునీటి కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా జరుగనుంది. ఆఖరి రోజు శనివారం నాడు కూడేరులో ప్రారంభమైన యాత్ర తలుపూరు, ఒడ్డుపల్లి మీదుగా రాప్తాడుకు చేరుకుంది. అక్కడి నుంచి హంపాపురం, కందూరుకూరు మీదుగా సాయంత్రానికి ఆకుతోటపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ యాత్రకు సత్యసాయి జిల్లా ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్పతో ప్రజాశక్తి సిబ్బంది మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పలుచోట్ల సభల్లో మాట్లాడారు. అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు సాగునీటి వనరులు చాలా తక్కువగా ఉన్నాయని చెప్పారు. ఉన్న వనరులు కూడా సక్రమంగా నీటిని అందివ్వలేని దుస్థితి ఉందని తెలిపారు. ఏకైక నిఖర జలాలున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు 2008లో ప్రారంభమైతే ఇప్పటికీ పూర్తవ లేదని విమర్శించారు. మధ్యలోనే నీరు ఆగిపోవడంతో తుంగభద్ర డ్యామ్‌లో పుష్కలంగా నీరున్నా జిల్లాకు తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. తుంగభద్ర డ్యామ్ ప్రధాన గేట్లు అధ్వాన్నంగా ఉన్నాయని నిపుణులు చెప్పారని గుర్తు చేశారు. తక్షణం వాటిని మార్చుచేయాల్సి ఉందన్నారు. కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు చెరో రూ.50 కోట్లు కేటాయిస్తూ మార్పు చేయవచ్చునని తెలిపారు. ఇప్పటికీ ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. జిల్లాలో ఉన్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణకు నవంబర్‌లో పెట్టబోయే బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువ వెడల్పుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ రెండు కాలువల పనులు చేపడితే జిల్లాకు సాగు, తాగునీటి వనరులు చాలా వరకు అందించేందుకు వీలుంటందన్నారు. అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం మద్యం, ఇసుక మీదనే దృష్టి సారించిందని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిని పట్టించుకునే పరిస్థితుల్లేవని దుయ్యబట్టారు. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు సాగునీటికై సిపిఎం చేపట్టిన పోరాటానికి రైతులు, ప్రజలు సంఘీభావం మద్దతు తెలపాలని కోరారు. సోమవారం నాడు కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, మన్నీల రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

సాగునీటి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన అనంతపురం కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రాంభూపాల్ తెలిపారు. ఐదు రోజులుగా జిల్లాలో సాగునీటి కాలువల పరిస్థితిని బస్సుయాత్ర ద్వారా తెలుసుకున్నామన్నారు. ఈ సమస్యలను మహాదర్నా ద్వారా అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. మహాధర్నాలో రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వివక్ష ఘటనపై అధికారుల ఆగ్రహం

అంగన్‌వాడీలో ముగ్గురికి షోకాజ్ నోటీసులు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం తింటున్న చిన్నారులు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

అనంతపురం జిల్లా పడమటి కోడిపల్లి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులపై జరిగిన వివక్ష ఘటనపై అధికారులు స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి అంగన్‌వాడీ కేంద్రం ఆయా దాసక్క, కార్యకర్త యశోద, వేపులపర్తి సెక్టార్ సూపర్‌వైజర్ రామాంజనమ్మకు శనివారం షోకాజ్ నోటీసులు అందించామని సిడిపిఒ లక్ష్మీప్రసన్న తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పడమటి కోడిపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాడు కేంద్రానికి ఇద్దరు దళిత చిన్నారులు వెళ్లగా వారిని తన ఇంట్లోకి అనుమతించరాదని ఇంటి యజమాని అంగన్వాడీ నిర్వాహకులకు తెలిపారు. ఇద్దరు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రం బయటే కూర్చొబెట్టడంతో ఈ వివక్షపై సిడిపిఒకు ఫిర్యాదు చేశారు. స్పందించిన సిడిపిఒ వెంటనే పడమటి కోడిపల్లి అంగన్వాడీ కేంద్రానికి వచ్చి సమస్యను తెలుసుకున్నారు. ఈ విషయం పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీవో వినూత్న, డీఎస్పీ రావి బాబు ఆదేశాలు మేరకు ముగ్గురు అంగన్‌వాడీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు అందించారు. చిన్నారుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేసి వాస్తవాలు తెలుసుకోవాలని ఆర్డీవో ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. కాగా అంగన్వాడీ కేంద్రంలో కుల వివక్షత పాల్పడిన అంగన్వాడీ సిబ్బంది, అద్దె యజమానిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఉదయం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా నాయకులు చెలిమప్ప, ఎరిడికెర చంద్ర, చనమల్లి, నరసింహులు, మల్లికార్జున, నారాయణ తిమ్మప్ప పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

కమిషనర్‌తో సిఐటియు నాయకుల చర్చలు



కమిషనర్‌తో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే ఇంజనీరింగ్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి వీలైనంత త్వరలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాగరాజు హామీ ఇచ్చారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం కమిషనర్ ఛాంబర్‌లో సిఐటియు నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సిఐటియు నేతలు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులు 2011లోని9 నెలల పిఎఫ్ బకాయి, హెడ్‌వాటర్ వర్క్సులో పని చేస్తున్న కార్మికులకు టిఎలు ఇవ్వాలని, పారిశుధ్యం రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ అదనపు కార్మికులకు రూ.15వేల వేతనం ఇవ్వాలని కోరారు. వీటితోపాటు పనిముట్లు ఇవ్వాలని, యూనిఫామ్, కొబ్బరినూనె, చెప్పులు, టెక్నికల్ సమస్యలతో బకాయి ఉన్న వేతనాలు ఇవ్వాలని, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలకు కన్సల్టెంట్‌ను ఏర్పాటు చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే వరద బాధితుల కోసం పని చేయడానికి విజయవాడ వెళ్లిన కార్మికులకు రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, పెరిగిన జనాభా అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ ఇంజినీరింగ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, పారిశుధ్య మున్సిపల్ యూనియన్ రెగ్యులర్ నాయకులు ముత్తురాజు, నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, ఇంజినీరింగ్ నగర నాయకులు మురళి, ఓబుళపతి, పోతులయ్య, శ్రీనివాసరెడ్డి, శివ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యల నివారణే లక్ష్యం

రెడ్స్ డైరెక్టర్ భానుజా, నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అనురాధ

ప్రజాశక్తి-అనంతపురం



మహిళా రైతులను సన్మానిస్తున్న అతిథులు

రైతుల ఆత్మహత్యలు నివారించడమే తమ లక్ష్యమని రెడ్స్ డైరెక్టర్ భానుజా, నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అనురాధ అన్నారు. శనివారం అనంతపురం సమీపంలోని కురుగుంటలో ఉన్న పుడమిసిరి ఆర్గానిక్ ఫామ్‌లో జిల్లాలోని మహిళా రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 2800 మంది మహిళా రైతుల వ్యవసాయ ఉత్పత్తులు, మిల్లెట్ పండించేవారు ఉన్నారన్నారు. చిన్న, సన్నకారు, కౌలు రైతులు పండించే ప్రకృతి వ్యవసాయం, పండ్ల తోటల ఉత్పత్తి దారులతో సమీక్షలు నిర్వహించి ప్రకృతి సేద్యంపై వివరిస్తున్నట్లు తెలిపారు. పురుగు మందులు వాడకుండా పంటలు పండిస్తేనే ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం బాల్య వివాహాలపైన అవగాహన కల్పించారు. తర్వాత ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధిస్తున్న మహిళ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మిత్ర హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ వందన, కోఆర్డినేటర్లు రాజశేఖర్, సుశీలమ్మ, అలివేలమ్మ, మహిళా రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సమన్యాయం

ఎపి పిసిసి జనరల్ సెక్రటరీ వెంకట నరసింహులు



మాట్లాడుతున్న ఎపి పిసిసి జనరల్ సెక్రటరీ వెంకట నరసింహులు

ప్రజాశక్తి-అనంతపురం

కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో అన్నివర్గాలకూ సమన్యాయం సాధ్యమని ఎపి పిసిసి జనరల్ సెక్రటరీ వెంకట నరసింహులు అన్నారు. శనివారం అనంతపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వై.మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త క్షేత్రస్థాయిలో పని చేసి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు మండల, నియోజకవర్గ కమిటీలను వేయాలన్నారు. కార్యకర్తలందరూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి రాహుల్ గాంధీని ప్రధాని చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి పిసిసి వైస్ ప్రసిడెంట్ కోటా సత్యం, నాయకులు ప్రభాకర్, రహంతుల్లా, రామ్‌గోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సోనియా సీన, యుగంధర్, చంద్ర, వెంకటరెడ్డి, లోకేష్, గౌని నాగరాజు, అనిల్, వీరయ్యచౌదరి, దాదాపీర్, ఉద్ధవసింహా, ఓబిరెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

---

8 ఏళ్లు అవుతున్నా పట్టించుకోరా..?

వంతెన నిర్మాణంపై అధికారులు, పాలకుల నిర్లక్ష్యం



కూలిపోయిన వంతెన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండలం హెచ్ఎల్‌సి కాలువ మీద కెకె.అగ్రహారం నుంచి దుర్గం, ఏడావులపర్తి గ్రామాలకు వెళ్లే కాలువపై వంతెన ఉండేది. 8 సంవత్సరాల క్రితం ఇది కూలిపోయింది. పాలకులు మారుతున్నారనే తప్పా ఈ వంతెనను మాత్రం నేటికీ పునరుద్ధరించలేదు. వంతెన లేకపోవడంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలోకి నీరు వస్తే అటువైపునకు రాకపోలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులను కోరితే హెచ్ఎల్‌సి అధికారులు కాలువ వద్ద పరిశీలన చేసి వెళ్లడం తప్పా పనులు చేపట్టిన దాఖలాలు లేవు. పాలకులు కూడా ఈసమస్యను పట్టించుకోకుండా అలాగే వదిలేశారు. ప్రస్తుతం పల్లె పండుగ, గ్రామసభల పేరుతో హడావుడి చేస్తున్న పాలకులు, అధికారులకు ఈ వంతెన కన్పించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా పలకులు అధికారులు స్పందించి కెకె.అగ్రహారం దుర్గం, ఏడావులపర్తి గ్రామాలకు వెళ్లే వంతెన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలీసు అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం

అదనపు ఎస్పీ అడ్మిన్ డివి.రమణమూర్తి



ప్రజాశక్తి-అనంతపురంక్రైం

విధినిర్వహణలో వివిధ కారణాలతో మృతి చెందిన అమరవీరుల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని అదనపు ఎస్పీ అడ్మిన్ డివి.రమణమూర్తి అన్నారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రయోజనాలు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు, కుటుంబ స్థితిగతులు, బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మృతిచెందిన పోలీసు కుటుంబాల సమస్యలను తెలుసుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. వారి కుటుంబ యోగక్షేమాలు అడిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సిబ్బంది సంక్షేమం కోసం అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. మరణించిన సిబ్బంది కుటుంబాలతో సమన్వయం చేసుకుని వారి సమస్యలను తనదృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ సహాయ, సహకారం అందిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌బి సిఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్, ఆర్ఐ మధు, ఆర్ఎస్ఐ రమేష్‌నాయక్, జిల్లా పోలీసు పరిపాలన కార్యాలయ ఎఒ శంకర్, సూపరింటెండెంట్లు ప్రసాద్, సావిత్రమ్మ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, పోలీస్ అమరవీరుల కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

రహదారులపై మురుగు తొలగింపు

పరిశీలించిన మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

గత శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నగరంలోని రహదారులపై పేరుకుపోయిన మురుగునీరు, బురదను శనివారం తొలగించారు. ఇందులో భాగంగా నగరంలోని వడ్డేవారి కాలనీ, జనశక్తి నగర్, సోమనాథ్‌నగర్, రజకనగర్, బాలాజీ కాలనీ, భవానీనగర్, వినాయక నగర్‌లలో మేయర్ పర్యటించి మురుగు తొలగింపు పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా చిన్న డోజర్లతో మురుగు మట్టిని తొలగించి నీరు ఎప్పటికప్పుడు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. వినాయక నగర్‌లో ఇళ్ల సమీపంలో నీరు నిలబడి ఉంటే ప్రత్యేక యంత్రంతో నీటిని తొలగించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఐదు రోజులుగా తుఫాను, శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవడంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కావున వెంటనే ఫాగింగ్, శుభ్రత చర్యలు చేపట్టాలని సిబ్బందిని దేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, ఎంహెచ్‌ఒ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


మురుగుతీతను పరిశీలిస్తున్న మేయర్ వసీం

లింగ నిర్ధారణ నేరం : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-అనంతపురం

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి హెచ్చరించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి కార్యాలయంలో జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయివేటు స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ జరిగినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ నేరం అనే పోస్టర్లను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. అలాగే లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆర్డీటీ సంస్థ డాక్టర్ దుర్గేష్ మాట్లాడుతూ సమాజంలో లింగ నిష్పత్తి అసమానతలను తొలగించడం కోసం నిరంతరం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ డాక్టర్ శ్రీదేవి, ప్రోగ్రాం అధికారులు యుగంధర్, సుజాత, నారాయణస్వామి, రవిశంకర్, అనుపమ, జేమ్స్, జిజిహెచ్ నుంచి స్త్రీవ్యాధి నిపుణులు రేణుక, చిన్నపిల్లల వ్యాధి నిపుణులు రవికుమార్, పథాలజిస్టు లక్ష్మీదేవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథ్‌రెడ్డి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గురుమూర్తి, డెమో త్యాగరాజు, గంగాధర్, ఆరోగ్య విద్యా బోధకులు వేణు, షఫీ, విజయ్, వెంకటేష్, కిరణ్, లీగల్ అడ్వైజర్ ఆశారాణి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ ఇబి.దేవి

అరటి పంట పరిశీలన

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో రైతు మద్దిలేటి స్వామి సాగు చేసిన అరటిపంటను పులివెందుల శాస్త్రవేత్త శివరామకృష్ణ శనివారం పరిశీలించారు. గ్రామానికి చెందిన కౌలు రైతు మద్దిలేటి స్వామి జైన్ కంపెనీ నుంచి అరటి మొక్కలు కొనుగోలు చేసి పంట సాగు చేశారు. అయితే అప్పటి నుంచి మొక్కలు ఎదుగుదల పూర్తిగా పడిపోయింది. దీంతో రైతు ఉద్యాన అధికారులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన శాస్త్రవేత్త శివరామకృష్ణ పొలానికి వచ్చి అరటి మొక్కలను పరిశీలించారు. మట్టి, నీటి పరీక్షలు చేయించాలని రైతుకు సూచించారు. అదేవిధంగా అరటి మొక్కల వేర్లను కూడా పరిశీలించారు. డ్రిప్ ద్వారా రోజూ నీటితడులు పెట్టినప్పటికీ మొక్కల ఎదుగుదల లేకపోవడంతో తాను తీవ్రంగా నష్టపోయానని ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు అధికారులను వేడుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారిణి మిత్రవింద మాధవి, మండల వ్యవసాయాధికారి ముస్తాక్‌అహ్మద్, విఎఎ, వీహెచ్ఎలు, తదితరులు పాల్గొన్నారు.


అరటి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలు అవసరం

ప్రధానోపాధ్యాయురాలు బిల్ కిష్ బేగం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

విద్యార్థులకు వృత్తివిద్య విభాగంలో నైపుణ్యాలు ఎంతో అవసరమని వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బిల్ కిష్‌బేగం తెలిపారు. శనివారం మండల పరిధిలోని వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆర్ట్ టీచర్ శ్రీదేవి ఆధ్వర్యంలో రంగోత్సవ్-2024 కాంపిటీషన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతోపాటు వృత్తి విద్యలో కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వృత్తి విద్య నైపుణ్యాలను పెంపొందించేందుకే పాఠశాలలో నేచర్ డ్రాయింగ్, కలరింగ్, కర్రీ కేచర్, హ్యాండ్ రైటింగ్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులు

సిఎంకు విరాళం చెక్కు అందజేత

బుక్కరాయసముద్రం : వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సొంత పంచాయతీ కొండాపురంలో సేకరించిన విరాళం చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. కొండాపురం గ్రామస్తులు సేకరించిన రూ.50వేల చెక్కును రాజధానిలో సిఎంకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవతా దృక్పథంతో తన నియోజకవర్గ ప్రజలు ఆర్థికసాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. సాయం చేయడంతో తమ ప్రజలు ఎల్లప్పుడూ ముందుంటారని సిఎంకు తెలియజేసినట్లు తెలిపారు.


సిఎంకు చెక్కు అందజేస్తున్న శ్రావణిశ్రీ

సోమనాథ్‌నగర్‌లో బ్రిడ్జి నిర్మించాలి

మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో నుంచి తపోవనం వెళ్లే దారిలో సోమనాథ్‌నగర్ వద్ద బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం 1వ నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సిపిఎం 1వ నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారిగా ఉన్న తపోవనం వైపు వెళ్తే దారిలో సోమనాథ్ నగర్ వద్ద బ్రిడ్జి నిర్మించి 50ఏళ్లు దాటడంతో కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ఇక్కడ గత ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలిచినా తర్వాత పట్టించుకోలేదన్నారు. బ్రిడ్జి నిర్మాణం లేనందువలన చిన్నపాటి వరదలు వస్తే సమీపంలోని రంగస్వామినగర్, యువజన కాలనీ, రజకనగర్, గౌరవ గార్డెన్, హనుమాన్‌కాలనీ, 4, 5, 6వ రోడ్లలో ఉన్న ఇళ్లల్లోకి వరద నీరు వస్తుందన్నారు. రెండేళ్ల క్రితం వచ్చిన వరదతో ప్రజల తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. అలాంటి వర్షం వచ్చిన ప్రతిసారీ ప్రజలు ప్రాణభయంతో రాత్రింబవళ్లు భయంభయంగా గడపాల్సి వస్తోందన్నారు. కావున మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటనారాయణ, ప్రకాష్, వలి, డివైఎఫ్ఐ నాయకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

హాస్టళ్ల తనిఖీ


హాస్టల్‌ను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథాచారి

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని ఇసుళ్లపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీ విశ్వనాథాచారి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హాస్టల్‌లోని రికార్డులు, పరిసరాలు, వసతి గదులు, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను విద్యార్థులు జడ్జికి విన్నవించారు. అనంతరం వసతి గదుల పైకప్పు పెచ్చులూడి పడుతోందని తెలపగా పరిశీలించి పైకప్పును మార్చాలని ఎస్ఒకు సూచించారు. ఈకార్యక్రమంలో న్యాయవాది విసి.గంగాధర్ కుమార్, వార్డెన్ రామాంజనేయులు, కోర్టు ఉద్యోగి సాదిక్, పారా లీగల్ వాలంటరీ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : గుత్తి మండల న్యాయ సేవాసమితి ఛైర్మన్, ఆరవ అదనపు జిల్లా జడ్జి బి.సాదుబాబు ఆదేశాల మేరకు గుత్తి సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి శనివారం పామిడి ఎస్సీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వంట, వసతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ విసి.గంగాధర్‌కుమార్, టైపిస్ట్ ఎస్.సాదిక్‌వలి, హాస్టల్ వార్డెన్ ఆదినారాయణ, పారాలీగల్ వాలంటరీ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలను గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథాచారి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మౌలిక వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత గదులను పరిశీలించి గదుల్లో పెచ్చులూడి ఉండటంతో గమణించి ఆయా వార్డెన్లను ప్రశించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గంగాధర్, కుమార్, టైపిస్టు సాదిక్‌వలి, వసతిగృహం వార్డెన్ సంజీవరాయుడు, పారాలీగల్ వాలంటీర్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల ఎస్సీ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన కంపచెట్లను సర్పంచి మల్లెల జగదీష్ ఆధ్వర్యంలో శనివారం జెసిబితో తొలగించారు. కంపచెట్ల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజల వినతి మేరకు ముళ్లపొదలను తొలగించడంతోపాటు జెసిబితో గుంతలను పూడ్చివేశారు. ఈ కార్యక్రమంలో మీనుగా రామాంజనేయులు, నల్లబోతుల ఈశ్వరప్ప, బైనే భార్గవ్, బండారు ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఇఒఆర్‌డి కమలాబాయి, ఎఒ నాగకృష్ణ, సుస్మిత్, పంచాయతీ సెక్రటరీలను శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో వారు చేసిన సేవలను నాయకులు కొనియాడారు. తర్వాత నూతనంగా ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన శకుంతల, ఎఒ రమాదేవిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మహేష్, గురుప్రసాద్, సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో అన్నదానం

అనంతపురం : బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె కిషోర్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తనయుడు వియాన్ జన్మదినం సందర్భంగా శనివారం నగరంలోని పెద్దాసుపత్రిలో అన్నదానం చేశారు. అంతకు ముందు కిషోర్ నివాసంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పల్లె కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, పివికెకె ఛైర్మన్ పల్లె కిశోర్

గాయపడిన కార్మికుడిని ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పైపులైన్ మరమ్మతులు చేస్తూ విద్యుదాఘాతానికి గురై గాయపడిన ఇంజినీరింగ్ కార్మికుడు గౌరీశంకర్‌ను అన్నివిధాలా ఆదుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ గౌరీశంకర్ పూర్తిగా కోలుకునేంత వరకూ మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అంతేగాకుండా వేతనంతో కూడా సెలవులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగభూషణం, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, ఇంజినీరింగ్ సెక్షన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు మురళి, ఓబుళపతి, కోశాధికారి పోతలయ్య, హెల్త్‌సెక్షన్ నగర అధ్యక్షుడు ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ మహోత్సవం

యాడికి : మండల కేంద్రంలోని మైలవరం ఖాదీ సిల్క్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సెక్రటరీ కుండా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్యారడైజ్ హైస్కూల్‌లో ఖాదీ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్లకార్డులు చేత పట్టుకుని 'ఖాదీ ఫర్ నేషన్ ఖాదీ ఫర్ ఫ్యాషన్, బి వోకల్ ఫర్ లోకల్, ఆత్మనిర్భర్ భారత్' అంటూ నినాదాలు చేస్తూ కాలనీల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఖాదీ వస్త్రాలను ప్రతిఒక్కరూ ధరించాలన్నారు. దేశవ్యాప్తంగా ఖాదీ ఉత్పత్తులను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్మినిస్ట్రేటర్ సంజీవనాయుడు, ఖాదీ సంస్థ సభ్యులు, శ్రీరామ గ్రూప్స్ అధినేత రామిరెడ్డి, చింతా ఓబుళకొండయ్య, చారుగుండ్ల చెన్నప్ప, చింతా వెంకటయ్య, కాలవ శ్రీనివాసులు, కాలవ పునీత్‌కుమార్, మురళి, హేమాద్రి, శివప్రసాద్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు పంపిణీ

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని వేపులపర్తి, పాలవెంకటాపురం గ్రామాల్లో గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేసినట్లు మండల పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నందున వ్యాధుల నివారణ కోసం మందులు వేసినట్లు తెలిపారు. పాలవెంకటాపురంలో 1,350, వేపులపర్తి గ్రామంలో 2,586 టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది సుధ, అబ్దుల్లా, సుధీర్, కుమార్, కులశేఖర్, జలీల్, లింగన్న గౌడ్, మంజుల, నవీన్, గీత భానుప్రియ, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీపై అవగాహన

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వేములపాడు సచివాలయంలో ఉన్న కొట్టాలపల్లి గ్రామంలో శనివారం మలేరియా, డెంగీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే పాటించాలని సూచించారు. అలాగే ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక కేంద్రంలోని ల్యాబ్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించి టెక్నీషియన్‌కు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షబ్బీర్, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి శివచంద్రకుమారి, ఆశా కార్యకర్త సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌కు షోకాజ్ నోటీసు

యల్లనూరు : నూతనంగా నియమితులైన డిప్యూటీ తహశీల్దార్ మహబూబ్‌బాషాకు ఆర్‌డిఒ వసంతబాబు శనివారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. మహబూబ్‌బాషా బాధ్యతలు స్వీకరించిన రెండు రోజుల్లోనే తహశీల్దార్ కార్యాలయంలోగానీ, జిల్లా అధికారులకుగానీ సమాచారం ఇవ్వలేదు. దీంతో విధులకు గైర్హాజరైన డిప్యూటీ తహశీల్దార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

బాధిత కుటుంబానికి సాయం

అనంతపురం రూరల్ : నగరంలోని 11వ డివిజన్ పాతూరు అంబారపు వీధిలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కూలిపోయిన బాధిత కుటుంబానికి ఎంపి అంబికా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు కార్పొరేటర్ సుజాత శనివారం సాయం అందించారు. ఇల్లు కోల్పోయి నిరాశ్రయులుగా మారడంతో నిత్యావసర సరుకులు, కూరగాయలు, 25 కిలోల బియ్యం బ్యాగును అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు నంద, విజయకుమార్, కుమార్, పవన్, ఐటిడిపి సభ్యులు మంజునాథ్, బోయ మంజు, తగరకుంట నరసింహులు, అంకే రాము, సీనియర్ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు

తాగునీటి సమస్యపై మంత్రి సమీక్ష

ఉరవకొండ : అనంతపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల తాగునీటి సమస్యలపై ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఇ మురళీధర్‌రావు, డిఇ సద్దీన్‌తో అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పయ్యావుల

విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ

అనంతపురం : నగరంలోని జెసిఎస్‌నగర్‌లో ఉన్న ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 440 మంది విద్యార్థులకుపైగా రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేసి గుర్తింపు కార్డులు జారీచేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ రక్తగ్రూపును తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఎఒ శ్రీనాథ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు మోహన్‌కృష్ణ, భాస్కర్, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.ఆనంద్‌బాబు, ఎస్.పురుషోత్తం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సుహేల్, పూజిత, హర్షిణి, ఇందుసాయి, విద్యార్థులు పాల్గొన్నారు.


రక్త పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన ప్రభుత్వం


మాట్లాడుతున్న వైసిపి విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం : వంద రోజుల కూటమి పాలనలో విద్యారంగాన్ని నిర్వీర్యమైందని వైసిపి విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర విమర్శించారు. శనివారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటిని ఇప్పటి వరకూ ఉన్నత విద్యామండలి ఛైర్మన్, ఎపిపిఎస్‌సి ఛైర్మన్ పోస్టులను నియమించలేదన్నారు. దీన్నిబట్టి చూస్తేనే ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందన్నారు. అలాగే తల్లికివందనం, విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను అటకెక్కించారన్నారు. ఖాళీగా ఉన్న వీసీల పోస్టుల నియమాకానికి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విద్యార్థి విభాగం నాయకులు నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, రాఘవేంద్రరెడ్డి, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి మృతికి మంత్రి కేశవ్ నివాళి

ఉరవకొండ : మండలంలోని మోపిడి గ్రామానికి చెందిన రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్టు అధినేత నర్రా కేసన్న, మాజీ సర్పంచి నర్రా సుజాత దంపతుల కుమారుడు చైతన్య (23) మృతికి మంత్రి పయ్యావుల కేశవ్ నివాళులర్పించారు. శనివారం ఉరవకొండలో మృతదేహానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి, వై.మధుసూదన్‌రెడ్డి, ఉరవకొండ జడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, మాజీ ఎంపిపి ఏసీ ఎర్రిస్వామి వీరితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దీపావళికి రాయదుర్గం మీదుగా ప్రత్యేక రైలు

రాయదుర్గం : దీపావళి పండుగ సందర్భంగా మైసూరు నుంచి రాయదుర్గం మీదుగా విజయపుర (బీజాపూర్)కు ప్రత్యేక రైలు సర్వీసును నడపనున్నట్లు నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. 06567 నెంబర్ ప్రత్యేక రైలు అక్టోబర్ 30, నవంబర్ 2వతేదీన మైసూరు నుంచి బెంగళూరు, యశ్వంతపూర్, తుముకూరు, అరసికేరే, చిక్కజాజురీరు, చిత్రదుర్గ, రాయదుర్గం, బళ్లారి కంటోన్మెంట్, హొస్పేట్, కొప్పల్, గదగ్ బాగల్‌కొట్ మీదుగా విజయపుర వెళ్లనుంది. అలాగే 06568 నెంబర్ రైలు అక్టోబర్ 31న, నవంబర్ 3నపై ఆయామార్గాల్లోనే విజయపుర నుంచి మైసూర్‌కు వెళ్తుంది. ప్రయాణికులు ప్రత్యేక రైలుసేవను ఉపయోగించుకోవాలని కోరింది.

కాగా అక్టోబర్ 20నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకూ శని, సోమవారాలు మినహా చిక్కజాజురీరు నుంచి గుంతకల్లు మధ్య ప్రయాణించే 07585/07586 నెంబర్ ప్యాసింజర్ రైలుసేవలను రద్దు చేయనున్నట్లు నైరుతి రైల్వే హుబ్లీ అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ మనీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన గంగాధర్

బెలుగుప్ప : మండల పరిధిలోని కాలుపల్లి బ్రిడ్జికి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కాలువలోకి పడి వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ (30) నేడు జరిగే భార్య సీమంతానికి పొట్టేళ్లను కొనుగోలు చేశారు. అనంతరం ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి తిరిగి వస్తుండగా కాలువపల్లి బ్రిడ్జి వద్దకు రాగానే బ్రిడ్జిని ఢీకొని కాలువలోకి పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు బోరున విలపించారు.

కర్నాటక సరిహద్దున...

రాయదుర్గం : కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయదుర్గానికి చెందిన బొమ్మన్న (45) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని సిద్దేశ్వరకాలనీకి చెందిన బొమ్మన్న మోటర్ సైకిల్‌పై కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో ఉన్న పదారుగుడ్డం వద్ద పొలానికి వెళ్లాడు. పనులు చూసుకుని తిరిగి వస్తుండగా ఉన్నట్టుండి పంది అడ్డు వచ్చింది. దీంతో అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన బొమ్మన్నను స్థానికులు రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన బొమ్మన్న

మట్కా బీటర్ల అరెస్టు

యల్లనూరు : మండల పరిధిలోని బుక్కాపురం గ్రామం మలుపు వద్ద ఇద్దరు మట్కా బీటర్లను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు సిఐ సత్యబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఉంచి బుక్కాపురం మలుపు వద్ద తిమ్మంపల్లికి చెందిన గొడుగు బాబు, వాసాపురానికి చెందిన బోనాల మస్తాన్‌ను అదుపులోకి తీసుకుని రూ.1.40లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే మట్కా చీటీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

గార్లదిన్నె : మండల పరిధిలోని ఎగువపల్లి గ్రామానికి చెందిన నల్లపరెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన అశ్వర్థరెడ్డి పది రోజుల క్రితం నల్లపరెడ్డికి వరినారును విక్రయించాడు. అయితే వెంటనే వేరే రైతుకు విక్రయించాడు. దీంతో ఆగ్రహించిన నలపరెడ్డి శుక్రవారం కొడవలితో అశ్వర్థరెడ్డిపై దాడి చేశాడన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు శనివారం నలపరెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘటనపై పూర్తి విచారణ సిఐ సిఐ కౌలుట్లయ్య చేపట్టినట్లు తెలిపారు.

కొత్త సీసాలో పాతసారా..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కొత్త సీసాలో పాతసారా అనే చందంగా ప్రభుత్వ తీరు తయారైందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షంలో ఉండగా అనేక హామీలను తెలుగుదేశం పార్టీ ఇచ్చింది. గత ప్రభుత్వ విధానాల్లో అనేక మార్పులు తీసుకొస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా మద్యం విధానంలోనూ మార్పులు చేపడతామని చెప్పింది. ఈ మేరకు కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గత ప్రభుత్వం మద్యం దుకాణాలు ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించింది. ఈ ప్రభుత్వం ఆ విధానం రద్దు చేసి ప్రయివేటు వ్యక్తులకు ఇచ్చింది. దీని కోసం టెండర్లు పలిచింది. ఇందులో ఎక్కువ షాపులను అధికారపార్టీ నేతలే దక్కించుకున్నారు. వారి అనుమతి లేకుండా వేసిన వారికి చుక్కలు కనబడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ధర్మవరంలో ప్రతిపక్ష పార్టీకి చెందని ఒక దుకాణం తెరవగానే తెల్లారే సరికి ధ్వంసమైంది. ఇదిలా ఉంటే దక్కిన దుకాణాల్లోనూ అత్యధికం అధికారపార్టీ నేతలే ఉండటం గమనార్హం. అనంతపురం జిల్లా వరకు చూస్తే 136 దుకాణాలుంటే 27 శాతం దుకాణాలు ఒక ముఖ్య నేత అనుయాయులకే దక్కాయి. మరో వ్యక్తికి పది వరకు దక్కాయి. ఇక బిజెపి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఒక్కరికే ఐదు దుకాణాలు దక్కాయి. అవి కూడా ఆ పార్టీకి సంబంధించిన ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలోనే కావడం మరో విశేషం. ఇక అమ్మకాల వరకు చూస్తే అధికారపార్టీ నేతలకు సంబంధించిన వాటిల్లో ఇప్పటికే అనధికారిక పర్మిట్ రూములు ప్రారంభమయ్యాయన్న ఆరోపణలున్నాయి. అధికారికంగా ప్రభుత్వం ఎక్కడా పర్మిట్ రూములకు అనుమతినివ్వలేదు. కాని నేతలు మాత్రం తమనెవరు అడగేదంటూ ప్రారంభించారు.

ఇసుక విషయంలోనూ అదే జరుగుతోంది. పేరుకు ఉచితమంటున్నా అది కేవలం నేతలకు మాత్రమే కావడం గమనార్హం. ఇసుక అనుమతుల్లేకుండా తోడేసి అమ్మేసుకుంటున్నారు సామాన్యుడికి మాత్రం గత ప్రభుత్వానికి ఇంచుమించు ధరల్లోనే ఇసుక లభిస్తోంది. పై రెండింటిపైనా పెద్దఎత్తున విమర్శలు రావడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి మరీ ఆ రెండింటి జోలికెళ్లవద్దని సూచించారు. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి ముగ్గురు నేతలకు సుతిమెత్తని హెచ్చరికలు చేసినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో అప్పటి అధికారపార్టీ నేతల తరహాలోనే ఇప్పటి అధికారపార్టీ నేతలు కూడా ఇసుక, భూములతోపాటు, కొత్తగా మద్యం కూడా తోడై డబ్బులు చేసుకునే పనిలో పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. పై వాటి విషయాల్లో అంతకు ముందు ప్రభుత్వానికి ఇప్పటికీ పెద్దగా తేడా లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొత్త విధానాలని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కొనసాగుతున్న తీరు మాత్రం పాత పద్దతుల్లోనే ఉందన్న ఆరోపణలున్నాయి.

ఈ వారంలో సిపిఎం బస్సు యాత్రను చేపట్టింది. జిల్లా రైతాంగానికి అత్యంత అవసరమైన సాగునీటి కోసం పోరాటాన్ని ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా బస్సుయాత్రను ప్రారంభించి శనివారంతో ఈ యాత్ర ముగిసింది. దీనికి ప్రజల నుంచి పలు చోట్ల స్పందన కనిపించింది. అనేక మంది మేధావులు, సామాజికవేత్తలు మద్దతు సైతం తెలిపారు. ప్రధాన పార్టీలకు భిన్నంగా సిపిఎం ప్రజా సమస్యలపై ఈ యాత్ర చేపట్టడం చర్చనీయాంశమూ అయింది.

సమస్యలు పరిష్కరించేందుకే సదస్సులు

గుత్తి : గ్రామాల్లో రీసర్వే పూర్తయి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఓబిలేసు తెలిపారు. శనివారం మండలంలోని మార్నేపల్లి, ధర్మాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతుల మ్యుటేషన్లు, ఖాతానంబర్లు, పట్టాదారు పాసుపుస్తకాల్లో పేర్లు తప్పులు, ఆధార్ నంబర్లు, సెల్‌ఫోన్ నెంబర్లు తప్పుగా పడి ఉంటే సదస్సుల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ రంగయ్య, సర్వేయర్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : భూ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు కల్లూరు అగ్రహారం, కుప్పలకొండల గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఈరమ్మ మాట్లాడుతూ రైతులు రీసర్వేలో వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి దివాకర్‌రెడ్డి, ఆర్ఐ వరలక్ష్మి, మండల సర్వేయర్ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి గ్రామసభలు

బెలుగుప్ప : మండలంలో రీసర్వే పూర్తయిన నాలుగు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ షర్మిల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం ఆవులెన్న, మధ్యాహ్నం గుండ్లపల్లి, 22న ఉదయం కోనంపల్లి, మధ్యాహ్నం గంగవరం గ్రామంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పప్పుశనగ పంపిణీ

బెలుగుప్ప : మండల కేంద్రంలోని ప్రభుత్వ గోడౌన్ వద్ద మండలంలోని రైతులకు శనివారం పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఎఒ పృథ్వీసాగర్ తెలిపారు. మండల వ్యాప్తంగా 989 రైతులు విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఇందుకోసం ఇప్పటి వరకూ వెయ్యి క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, తగ్గుపర్తి రాధాకృష్ణ, మాజీ ఎంపిటిసి కంచరాముడు, నక్కలపల్లి రామ్మోహన్‌రెడ్డి, అగ్రికల్చర్ సిబ్బంది శిల్పా, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలను సీజ్ చేయాలి

ఉరవకొండ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పట్టణంలోని మహేశ్వరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎం.హారూన్‌రషీద్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని ఎంఇఒ-2 రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందసర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనాలను సేఫ్టీ మెజెర్‌మెంట్ లేకుండా డ్రైయినేజీపై ఐదు ఫ్లోర్లు నిర్మించి పాఠశాలను నిర్వహిస్తున్నారన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సురేష్, సహాయ కార్యదర్శి నవీన్‌కుమార్, పట్టణ కార్యదర్శి కరుణాకర్, పట్టణ అధ్యక్షులు రాజేష్, సహాయ కార్యదర్శి సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పలువురు యువకులు శనివారం స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసుకున్నారు. కాలనీలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో తామే స్వయంగా మట్టితో స్పీడు బ్రేకర్లు వేసుకున్నట్లు యువకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు రవి, నాగరాజు, గణేష్, విల్సన్, సాయికుమార్, ప్రశాంత్, రఫీ, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్న ఎస్సీ కాలనీ యువకులు

ముగిసిన 'పల్లె పండుగ'



నార్పల మండలంలో భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని నాయనపల్లి, రంగాపురం, గంగనపల్లి గ్రామాల్లో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి, ఉపాధి హామీ ఎపిఒ రామారావు సర్పంచులు మల్లీశ్వరి, కుళ్లాయప్ప, రెడ్డి, ఎంపిటిసి బయపురెడ్డి, గ్రామ కార్యదర్శులు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని పుట్లూరు, బాలాపురం, సి.వెంగన్నపల్లి, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి పంచాయతీల్లో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సీసీరోడ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎల్‌కె.చెన్నారెడ్డి, శివనారాయణరెడ్డి, మునిరెడ్డి, ఎంపిడిఒ అలివేలమ్మ, ఎపిఒ చెన్నకేశవులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో ఎంపిడిఒ వీర్రాజుఇఒఆర్‌డి శశికళ ఆధ్వర్యంలో శనివారం 'పల్లె పండుగ' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వేలూరు రంగయ్య, ఎపిఒ రమేష్, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, నెట్టికంటయ్య, రంగస్వామి, శరభారెడ్డి, నగురూరు నరసింహులు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని జనార్ధనపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమం శనివారం గ్రామ సర్పంచ్ రాయంకి.జనార్ధన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మన రాష్ట్రానికి కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేశారన్నారు.ఇందులో భాగంగా గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులకు సంబంధించి భూమి పూజ చేశారు.సిమెంట్ రోడ్లను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను సర్పంచ్,గ్రామ ప్రజలు కోరారు.ఈ కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి సత్య బాబు, సచివాలయం సిబ్బంది,ఉపాధి హామీ సిబ్బంది,నాయకులు కావేటి చౌదరి,కష్టమూర్తి,రాజన్న ,నూతన పాటి కోనేటి, ఎర్రి స్వామి,గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

గార్లదిన్నె : మండల పరిధిలోని ఎర్రగుంట్ల, పెనకచర్ల, డ్యాం గ్రామాల్లో శనివారం మండల అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రగుంట్ల గ్రామంలో 10 లక్షల రూపాయలతో, పెనకచర్ల గ్రామంలో, 15 లక్షల రూపాయలతో, డ్యాం గ్రామంలో 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యోగానంద రెడ్డి, ఈవో ఆర్ డి దామోదరమ్మ, ఏపీవో నాంచారమ్మ ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



శింగనమల మండలంలో భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

యల్లనూరు : యల్లనూరు మండలం మల్లాగుండ్ల పంచాయతీలోని మూడు గ్రామాల్లో శనివారం పల్లె పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాంపల్లి, దుగ్గుపల్లి, మల్లాగుండ్ల లోని ప్రజాప్రతినిధులు చేత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సిసి రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

శింగనమల : మండలంలోని పెరవలి, శివపురం, నాగులగూడెం తండా గ్రామాల్లో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ నిర్మలకుమారి, సర్పంచి రాజు, టిడిపి నాయకులు మారుతీనాయుడు, పుచ్చకాయల రాము, తలారి నాగరాజు, డీలర్ సాదిక్‌వలి, బండమీదపల్లి కాయల రమణయాదవ్ ,ఎర్రిస్వామి యాదవ్, జయరాంయాదవ్, సర్పంచి లక్ష్మీదేవి, ఎంపీటీసీ అంజనమ్మ, సుదర్శన్‌నాయక్, జరపాల అంజీనాయక్, సీనానాయక్, దామోదర్‌నాయక్, నెట్టికంటి, రామన్నయాదవ్, వెంకటరమణ యాదవ్, చెన్నయ్య డీలర్, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై శిక్షణ

రాయదుర్గం రూరల్ : రాయదుర్గం డివిజన్‌లోని రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాల వ్యవసాయ అధికారులు, ఆర్ఎస్‌కె సిబ్బందికి పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్లకు సంబంధించి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి సిఎల్ఎస్, పిడిఎస్ఎస్ మొబైల్ యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా రైతు సేవాకేంద్రాల పరిధిలో పంటలకు వచ్చే పురుగులు, తెగుళ్లు, మొబైల్ అప్లికేషన్లను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం అధికారిణి శైలజ, రాయదుర్గం సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్, రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ వ్యవసాయ అధికారులు మహేంద్ర, నిర్మల్‌కుమార్, శ్రీనివాసులు, రైతు సేవాకేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి

పంటకోత ప్రయోగం

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నోబిలం గ్రామంలో రైతు కె.రామకృష్ణ సాగు చేసిన వేరుశనగ పొలంలో శనివారం పంటకోత ప్రయోగం చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి శుభకర్ తనిఖీ చేసి సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎవిఎస్ఒ హేమావతి, ఆర్ఎస్‌కె సిబ్బంది చిక్కన్న, రైతులు నరసింహులు, కుళ్లాయప్ప, ఆదినారాయణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై నిఘా

గార్లదిన్నె : రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాల వరుస చోరీలపై ప్రత్యేక నిఘా వేసినట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో పోలీసులు రాత్రి 10గంటల తర్వాత గ్రామాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారన్నారు. త్వరలోనే వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఫిరోజ్‌ఖాన్, చిరంజీవి. తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం

శింగనమల : మండల పరిధిలోని కల్లుమడి గ్రామంలో నివాసం ఉంటున్న దాసరికేశమ్మ దాసరి గోవిందు కుమార్తె మునిలక్ష్మి వివాహానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శనివారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఓబుళపతి, నారాయణస్వామి, దండు రాము, మల్లేష్, వెంకటేష్, గోవిందు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

24న మండల సమావేశం

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 24వ తేదీ గురువారం ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గంగావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసిలు, జడ్పిటిసి, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం

శింగనమల : ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కోసం పోరాడుదామని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులతోపాటు దళితులు అభివృద్ధి చెందడానికి ఉన్న 27 పథకాలు రద్దు చేసిందన్నారు. ఆయా పథకాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆర్ట్ ఫెస్టివల్

బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం రీజియన్ పరిధిలోని సంఘం బడుల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు రంగోళి, పెయింటింగ్, క్లే మోడల్, డ్రాయింగ్ వంటి వాటిపై పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ పిల్లల్లోని నైపుణ్యతను వెలికితీయడానికే ఆర్డీటీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని సంఘం బడి పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎటిఎల్ సుధాకర్, సిఐలు అమర్నాథ్‌రెడ్డి, సిబిటిలు, సంఘం బడి పిల్లలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు